హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.121	175	200
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.129	187	213

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.5 । కనిష్ఠం 18.4

ఎన్నికల బడ్జెట్



లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ఎన్నికల బడ్జెట్‌గా ఉందని పలువురు అభివర్ణిస్తున్నారు. వివిధ రాజకీయ పార్టీలు బడ్జెట్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. వ్యవసాయం, అనుబంధ రంగాలకు ప్రాధాన్యం కల్పించగా, పేదల కోసం కొనసాగుతున్న ఉచిత ఆహార పంపిణీ యథావిధిగా ఉంచారు. పీఎం ఆవాస్ యోజనతో గృహ నిర్మాణదారులకు మేలు వంటి అంశాలపై నిర్మలాసీతారామన్ కీలక ప్రకటన చేశారు. అయితే ఉద్యాన పంటలకు, మత్స్యకార్మికులకు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, ఎస్సీ వర్గాల సంక్షేమానికి, గిరిజన మిషన్‌కు కేటాయింపులు మాత్రం అరకొరగా ఉన్నాయి. బడ్జెట్ జనరంజకంగా లేదని పలు వర్గాలు పెదవి విరుస్తున్నాయి. ఎన్నికల ఏడాది కావడంతో సంక్షేమ పథకాలు, కేటాయింపులు అధికంగా ఉంటాయని భావించినా, అందుకు భిన్నంగా ఉందని వారు పేర్కొంటున్నారు.

- నల్లగొండ

- నిర్మలాసీతారామన్ బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు
- ఆశాలు, అంగన్‌వాడీలకు ఆయుష్మాన్ భారత్
- మహిళా సంఘాలకు, మహిళలకు రుణాలు
- పీఎం ఆవాస్ యోజనతో పేదలకు మేలు
- రూ.7లక్షల వరకు ఆదాయంపై ట్యాక్స్ మినహాయింపు
- పాడి రైతుల ప్రోత్సాహానికి కీలక నిర్ణయం
- ఉమ్మడి జిల్లాకు దక్కని కేటాయింపులు

పాడి పరిశ్రమకు ప్రోత్సాహం

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయ రుణాలకు ప్రాధాన్యం కల్పించింది. దీంతో వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రయోజనం చేకూరనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వ్యవసాయ రంగంపై 9.50 లక్షల మంది ఆధారపడి ఉన్నారు. పశుపోషణ, మత్స్య, పాడి పరిశ్రమకు రుణాలు పెరగనున్నాయి. స్వల్ప కాల పంట రుణాలకు తక్కువ వడ్డీ వర్తింపజేయనున్నారు. ఈ రుణాల్లో పాడి పరిశ్రమకు కూడా ప్రాధాన్యం ఉండడంతో వ్యవసాయం తర్వాత పాడిపైనే అధికంగా ఆధారపడ్డ రైతులకు ప్రయోజనం దక్కనుంది. ఉమ్మడి జిల్లాలో 3.50 లక్షల మంది పాడి రైతులు ఉన్నారు. అభివృద్ధి చెందిన డెయిరీలకు అనుబంధంగా రైతుల పాడి ఉత్పత్తులను అనుసంధానం చేసేలా కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

ఆశాలు, అంగన్ వాడీలకు ఆయుష్మాన్ భారత్

అంగన్ వాడీలు, ఆశా వర్కర్లకు కేంద్రం ఆయుష్మాన్ భారత్ యోజనను వర్తింపజేసేందుకు నిర్ణయించింది. ఈ ఆరోగ్య బీమా పథకం ఉమ్మడి జిల్లాలో సుమారు 10వేల మందికి వర్తించనుంది. ఈ పథకం కింద ఏ ఆస్పత్రిలోనైనా సేవలు పొందవచ్చు. నగదు రహిత చికిత్స కావడంతో ఆశాలు, అంగన్‌వాడీలకు ప్రయోజనం కలగనుంది.



పీఎం ఆవాస్ యోజన



కేంద్రప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన కింద గృహ నిర్మాణదారుడికి, కొనుగోలుదారుడికి రూ.2.65లక్షల వరకు ఖాతాలో జమ చేయనుంది. అయితే బ్యాంకుల్లో రుణాలు పొంది ఇల్లు కట్టుకున్న వారికే ఇది వర్తిస్తుంది. దేశవ్యాప్తంగా 2కోట్ల ఇళ్ల నిర్మాణానికి పీఎం కిసాన్ ఆవాస్ యోజన్‌ను వర్తింప చేయనున్నారు.

రైల్వేకు మొండిచెయ్యే



కేంద్ర ప్రభుత్వం మరోసారి ఉమ్మడి జిల్లాలో రైల్వే లైన్లకు మొండిచెయ్యే చూపింది. నల్లగొండ-మాచర్ల డబుల్ లైన్ పనులకు నిధులు కేటాయింపులు చేయలేదు. కేవలం సర్వేకే పరిమితమైంది. గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.450కోట్లు ఇప్పటికీ విడుదల చేయలేదు. అమృత్ పథకం కింద ఎంపికైన పలు రైల్వేస్టేషన్ల అభివృద్ధికి నిధులను కేటాయించింది. సికింద్రాబాద్-విజయవాడల మధ్య బుల్లెట్ రైల్ ప్రస్తావనే కరువైంది.

ఆదాయ పన్ను యథాతథం

కేంద్ర బడ్జెట్ ఆదాయ పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి మార్పులు చేయలేదు. గతంలో మాదిరిగానే పాత విధానాన్ని కొనసాగించింది. ఐటీ పరిధిలో ఉమ్మడి జిల్లాలో సుమారు 2లక్షల మంది ఉన్నారు. కొత్త, పాత విధానాన్ని బేరీజు వేసుకుని ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా వీటిని ఎంచుకొనే వెసులుబాటు ఉంది. ట్యాక్స్ పరిమితిని పెంచడం మంచిదే అయినా ఐటీ రిటర్న్ పరిమితిని తగ్గించారు. రూ.7లక్షల లోపు వరకు ఎలాంటి ట్యాక్స్ పడదు. చిన్నచిన్న పట్టణాలకు సంబంధించి సర్‌చార్జి విషయంలో గతంలో 37 శాతం ఉండగా ఇప్పుడు 25శాతానికి తగ్గించారు. అధిక అధాయ వర్గాలకు, తక్కువ ఆదాయం ఉన్న వారికి మాత్రమే ఆదాయ పన్ను పరిమితి అనుకూలంగా ఉంది. మధ్యతరగతి వర్గాలకు ఎలాంటి మార్పు లేదు. చిన్న వ్యాపారులతో పాటు ఉమ్మ డి జిల్లాలోని 60వేలమంది ఉద్యోగులకు కొంత ఊరటనిచ్చింది.

రూ.29కే కిలో భారత్ రైస్




బియ్యం ధరలు రోజురోజుకూ పెరుగుతున్న క్రమంలో ధరల నియంత్రణ కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా బియ్యం ధర రూ.6,500గా ఉంది. దీంతో మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్రం త్వరలో ప్రజలకు రూ.29లకే కిలో బియ్యాన్ని అందించేందుకు భారత్ రైస్ పేరుతో మార్కెట్‌లోకి తీసుకురానుంది. భారత్ రైస్ మార్కెట్‌లోకి వస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరగనుంది. ఆహార ఉత్పత్తులు తక్కువగా ఉన్నాయనే నెపంతో వ్యాపారులు బ్లాక్ చేస్తూ అధిక ధరలకు బియ్యాన్ని విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రూ.29కే కిలో బియ్యాన్ని కేంద్రం అమలుచేస్తే పేద, మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూరనుంది.

మహిళలకు పెద్ద మొత్తంలో రుణాలు




మహిళా సంఘాలు, వీధి, చిరు వ్యాపారులకు ఆర్థిక స్వావలంబన కలిగించేలా రుణాలు పెద్ద మొత్తంలో అందించేందుకు కేంద్రం నిర్ణయించింది. పీఎం స్వానిధి ద్వారా రుణాలు అందించనుంది. ఇప్పటికే పావలా వడ్డీతో పెద్ద మొత్తంలో సంఘాలకు రుణాలు అందిస్తున్నారు. ముద్ర రుణాలు కూడా విరివిగా ఇచ్చి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కేంద్రం నిర్ణయం తీసుకుంది. సమభావన సంఘాల గ్రూపులకు పెద్ద మొత్తంలో రుణాలు ఇవ్వడంతో పాటు వారు సకాలంలో వడ్డీ చెల్లించేలా ప్రణాళికలు రూపొందించింది.

సీపీఎస్‌కు ఈసారీ కలగని మోక్షం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 2004 తరువాత నియామకమైన ఉద్యోగులను ఇబ్బంది పెట్టేలా ఉన్న సీపీఎస్ విధానంపై కేంద్రం ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదు. ఉద్యోగుల వేతనం నుంచి కోత విధించే కొంత శాతాన్ని షేర్ మార్కెట్‌లో ఉంచడం వల్ల నష్టాలు వస్తాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఎఫ్ఆర్‌డీ చట్టాన్ని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆందోళనలతో పలు రాష్ట్రాల్లో నూతన పెన్షన్ విధానాన్ని ఆయా ప్రభుత్వాలు రద్దు చేశాయి. కేంద్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయాన్ని ఈ బడ్జెట్‌లో తీసుకోకపోవడంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు అంచల వారీగా పోరాటానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాయి.

పల్లెకో సారు



- పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియమాకం
- జిల్లాలో 421 పంచాయతీలకు 186మంది
- పలుచోట్ల రెండు గ్రామాలకు కలిపి ఒక్కరే ప్రత్యేకాధికారి
- నేటి నుంచి అధికారుల సారథ్యంలో స్థానిక పాలన

యాదాద్రి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం గురువారంతో ముగిసింది. పంచాయతీ పాలకవర్గాలు 2019లో ఏర్పడగా, ఈ నెల 1వ తేదీతో పదవీకాలం ముగిసింది. 2వ తేదీ నుంచి పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. సర్పంచులను పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా, ప్రభుత్వం మాత్రం ప్రత్యేకాధికారుల నియామకానికి మొగ్గుచూపింది. ఈ మేరకు జనవరి 31న ప్రభుత్వం ప్రత్యేక అధికారుల నియామకంపై ఉత్తర్వులు జారీచేసింది. గెజిటెడ్ స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించాలని పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 421 పంచాయతీలు ఉన్నాయి. అన్ని పంచాయతీలకు గురువారం ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా యంత్రాంగం ఉత్తర్వులు జారీచేసింది. వారు గ్రామపంచాయతీల్లో శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక నుంచి పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది.

421పంచాయతీలకు 186మంది

గ్రామపంచాయతీల పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రత్యేక అధికారుల నియమాక ప్రక్రియను జిల్లాయంత్రాంగం పూర్తి చేసింది. సర్పంచుల స్థానంలో ప్రత్యేక అధికారులుగా గెజిటెడ్‌స్థాయి అధికారులను నియమించారు. జిల్లా వ్యాప్తంగా అందుబాటులో ఉన్న గెజిటెడ్ ర్యాంకు అధికారుల జాబితాను రూపొందించింది. వారిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ తహసీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, మండల పంచాయతీ అధికారులు ఉన్నారు. జిల్లాలో 17 మండలాల్లో మొత్తం 421 పంచాయతీలు ఉండగా, మొత్తం 186 మందిని ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. పరిపాలనాపరంగా ఆయా గ్రామపంచాయతీలను బట్టి అధికారులను నియమించారు. జిల్లాయంత్రాంగం ఎంపిక చేసిన అధికారుల్లో జిల్లాలోని తండాలతో పాటు 500జనాభాకు పైగా ఉన్న గ్రామాలకు వరకు ఉన్నాయి. చిన్న గ్రామపంచాయతీలు ఉంటే, రెండింటికి కలిసి ఒక ప్రత్యేక అధికారిని నియమించగా, మేజర్ గ్రామపంచాయతీలకు ఒక్కో అధికారిని నియమించారు. జిల్లాలోని బీబీనగర్, వలిగొండ, ఆత్మకూరు, తుర్కపల్లి, బొమ్మలరామారం, మోటకొండూరు, రామన్నపేట, కొలనుపాక, గుండాల, తదితర గ్రామపంచాయతీలకు ఉన్నతస్థాయి గెజిటెడ్ అధికారులను నియమించారు. గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరిగి, కొత్త పాలకవర్గాలు ఏర్పడే వరకు ప్రత్యేక అధికారులే ఇక నుంచి పల్లెల్లో సేవలందించనున్నారు.

ప్రత్యేక అధికారులను నియమించాం



గ్రామపంచాయతీల పాలకవర్గం ముగియడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారుల నియామక ప్రక్రియను పూర్తి చేశాం. జిల్లాలో మొత్తం 421 పంచాయతీలకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 186మంది గెజిటెడ్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించాం. వారు శుక్రవారం నుంచి పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారు. పంచాయతీల్లో పరిపాలనాపరంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారు నిర్ణయాలు తీసుకుంటారు.

- జి.వీరారెడ్డి, అదనపు కలెక్టర్

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలి

కోదండరాంకు బాధితుల వినతి



కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌ఆర్‌ఆర్ బాధితులు

వలిగొండ, ఫిబ్రవరి 1: ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మండలంలోని వర్కట్‌పల్లి, గోకారం గ్రామాల రీజనల్ రింగ్‌రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) బాధిత రైతులు కోదండరాంకు విన్నవించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు విన్నవించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, గతంలో గ్యాస్‌లైన్, కాళేశ్వరం కాల్వలు, గౌరెల్లి-ఖమ్మం రోడ్డులో తాము భూములు కోల్పోయామని, తిరిగి ఆర్‌ఆర్‌ఆర్‌కు తమ భూములనే ప్రభుత్వం తీసుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌ఆర్‌ఆర్ కారణంగా తాము జీవనాధారం కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. అలైన్‌మెంట్‌ను మార్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు గుండు ధానయ్య, గోపి, వెంకటేశం, జనార్ధన్‌రెడ్డి, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ ఆహార పదార్థాలు విక్రయించడం నేరం

వలిగొండ, ఫిబ్రవరి 1: ప్రజలకు హానికరమైన కల్తీ ఆహార పదార్థాలను విక్రయించడం చట్ట ప్రకారం నేరమని ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి అన్నారు. గురువారం మండలంలోని ఓ హోటల్, కిరాణా దుకాణాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆహార పదార్థాలను విక్రయించే వ్యాపారులు ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడడమే తమ విధి అని అన్నారు. కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు తనిఖీలకు ఎంఎస్ మణికంఠ ట్రేడర్స్ దుకాణంలోకి అధికారులు వెళ్తుండగా సదరు వ్యాపారి తండ్రి నాగభూషణం వారి విధులకు ఆటంకం కలిగించాడు. దుకాణంలోకి వెళ్లనివ్వకుండా అడ్డుతగులుతూ మహిళా అధికారులను దుర్భాషలాడుతూ దాడికి యత్నించారు. సదరు వ్యాపారి అనుమతి లేకుండా వ్యాపారాన్ని నిర్వహించడంతోపాటు కల్తీఆహార పదార్థాలను విక్రయిస్తున్నాడని, సంబంధిత అధికారి స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

లక్ష్మీనృసింహుడికి వైభవంగా సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 1: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి గురువారం నిత్యవిధి కైంకర్యాలు సంప్రదాయరీతిలో వైభవంగా కొనసాగాయి. గజవాహన సేవోత్సవం నిర్వహించి విశ్వక్సేనుడికి తొలిపూజలతో నిత్యతిరుక ల్యాణోత్సవ పర్వాలు ఆగమ శాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానా లయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు.

ఆభరణాల లెక్కలు ఇన్‌చార్జి ఈవోకు అప్పగింత

ఏకశిఖరవాసుడు యాదగిరీశుడి ఆలయ ఖజానాలో నిల్వ ఉన్న బంగారం, వెండి ఆభరణాల వివరాలను మాజీ ఈవో ఎన్. గీతారెడ్డి గురువారం దేవ స్థాన ఈవో రామకృష్ణారావుకు అప్పగించారు.

అశోక్‌తేజకు తెలుగు భాషారత్న జీవన సాఫల్య పురస్కారం

● ప్రకటించిన ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు ● ఈ నెల 5న గుంటూరులో పురస్కారం అందుకోనున్న అశోక్ తేజ



సుద్దాల అశోక్‌తేజ

మోత్కూరు, ఫిబ్రవరి 1: తెలుగు సినీ, సాహితీ రంగంలో విశేష సేవలు అందించడం, తెలుగు భాషా వికాసానికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు తెలుగు భాషారత్న జీవన సాఫల్య పుర స్కారం ప్రకటించింది. గుంటూరు నాగార్జుననగర్‌లోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయం డైనమిక్ హాల్‌లో ఈ నెల 5న ఉదయం 10గంటలకు నిర్వహించనున్న కార్య క్రమంలో ఆయనకు పురస్కారం అందించను న్నట్టు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు ఒక ప్రకటనలో తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామంలో 1960 మే 16న జన్మించిన ఆయన అంచెలంచె లుగా ఎదుగుతూ పలు అవా ర్డులు సొంతం చేసుకున్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న గుర్రం హనుమంతు-జానకమ్మల కుమారుడు అశోక్‌తేజ. పాటలు రాసి పాడే హనుమంతును రైతాంగ సాయుధ పోరాటంలో, ఆ తర్వాత కూడా ఆయన స్వగ్రామమైన సుద్దాల పేరుతో సుద్దాల హను మంతుగా పిలిచేవారు. తన తండ్రి గుర్తుగా అశోక్‌తేజ తన ఇంటి పేరును సుద్దాలగా మార్చుకున్నారు. బాల్యం నుంచే ఆయన పాటలు రాసేవారు. 'నమస్తేఅన్న' చిత్రం ద్వారా ఆయన తెలుగు చిత్రసీమకు పరిచయ మయ్యారు. ఒసేయ్ రాములమ్మా, నిన్నే పెళ్లా డుతా సినిమాల్లో ఆయన రాసిన పాటలు ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. ఇప్పటి వరకు 1,200పైగా చిత్రాల్లో 2,200పైగా పాటలు రాశారు. సినీ పరిశ్రమకు రాక ముందు ఆయన ఉపాధ్యాయుడిగా పని చేసే వారు. 2003లో ఠాగూర్ సినిమాలో ఆయన రాసిన నేను సైతం.. అన్న పాటకు జాతీయ అవార్డు లభించింది. ఇప్పటికే ఆయన సినారె పురస్కారం, కొండెపూడి శ్రీనివాసరావు పుర స్కారాలు అందుకున్నారు. తల్లిదండ్రులు సుద్దాల హనుమంతు-జానకమ్మల పేరున సుద్దాల ఫౌండేషన్‌ను ఏర్పాటు సాహిత్యంలో విశిష్ట సేవలందించిన వారికి సుద్దాల హను మంతు-జానకమ్మ పురస్కారం అందిస్తున్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం నుంచి ఈ నెల 5న 'తెలుగు భాషారత్న జీవన సాఫల్య పురస్కారం' అందుకోనున్నారు.

ట్యాంక్ బండ్‌పై 'రావి' విగ్రహం ఏర్పాటుచేయాలి

● సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన రావి సేవా సంస్థ ప్రతినిధులు



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి, రావి సేవా సంస్థసభ్యులు

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 1: ఉత్తమ పార్లమెంటేరియన్, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత రావి నారాయణ రెడ్డి జ్ఞాపకార్థం కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయాలని రావి నారా యణరెడ్డి సేవా సంస్థ సభ్యులు సీఎం రేవంత్‌రె డ్డిని కోరారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డితో కలిసి గురువారం హైదరాబా ద్‌లో సీఎంను కలిసి వినతి పత్రం అందజేశారు. భువనగిరి శివారులోని రాయిగిరిలో నిర్మించనున్న క్రీడా ప్రాంగణానికి రావి నారాయణరెడ్డి పేరు పెట్టాలని కోరారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్, భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి, స్వగ్రామమైన బొల్లేపల్లిలో రావి నారాయణరెడ్డి నిలువెత్తు కాంస్య విగ్రహాలు ఏర్పాటుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రావి సేవా సంస్థ చైర్మన్ చెరుకుపల్లి శ్రీనివాస్, కార్యదర్శి రావి సుఖేష్‌రెడ్డి, కోశాధికారి తిరుమల్‌దాస్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

భారత్‌కు 31 సాయుధ డ్రోన్లు

వాషింగ్టన్, ఫిబ్రవరి1: వాస్తవాధీన రేఖ వెంబడి చైనాకు చెక్ పెట్టేందుకు.. హిందూ మహాసముద్రంలో పట్టు పెంచుకునేందుకు ఇండియాకు ఎంతగానో ఉపయోగపడే ఎమ్‌క్యూ-9బి ప్రిడేటర్ డ్రోన్లను విక్రయించడానికి అమెరికా ప్రభుత్వం గురువారం ఆమోదం తెలిపింది. ఈ డీల్ కింద 3.99 బిలియన్ డాలర్ల (సుమారు రూ.33వేల కోట్లు) విలువైన 31 డ్రోన్లను అమెరికా సరఫరా చేయనుంది. ఎమ్‌క్యూ-9బి రిమోట్లీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా పిలిచే ఈ సాయుధ డ్రోన్ల కొనుగోలుపై గత జూన్‌లో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. ఇందుకు అవసరమైన అనుమతి మంజూరు చేస్తూ అమెరికా కాంగ్రెస్ సర్టిఫికెట్ ఇచ్చిందని డిఫెన్స్ సెక్యూరిటీ కో-ఆపరేషన్ ఏజెన్సీ తాజాగా తెలిపింది. అమెరికా-భారత్ మధ్య వ్యూహాత్మక సంబంధాల బలోపేతంలో భాగంగా ఈ మెగా డ్రోన్‌డీల్ జరిగిందని పేర్కొంది. భారత్ భద్రతను పెంచేందుకు, ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతంలో సుస్థిర, శాంతి, ఆర్థిక ప్రగతిని పెంపొందించేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపింది. మానవరహిత నిఘా విషయంలో భారత్ సామర్థ్యాలు మరింత బలోపేతమవుతాయని అభిప్రాయపడింది. సైన్యం ఆధునికీకరణకు భారత్ కట్టుబడి ఉందని, అందువల్ల వీటిని అందజేయడంలో తమకు ఇబ్బందేమీ లేదని పేర్కొంది. వీటిని హై ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (హెచ్ఏఎల్ఈ-హేల్)యూఏవీలుగా వ్యవహరిస్తారు. ఈ 31లో 15 డ్రోన్లను సీగార్డియన్ల పేరుతో నేవీకి ఇస్తారు. స్కై గార్డియన్ పేరుతో ఎయిర్‌ఫోర్స్‌కు 8డ్రోన్లు, ల్యాండ్ వర్షన్ పేరుతో ఆర్మీకి మిగతా 8కేటాయిస్తారు. ఖలిస్థాన్ ఉగ్రవాది గురుప్రీత్ సింగ్ పన్నూన్ హత్యకు భారత్ కుట్రపన్నుతున్నందున డ్రోన్లఅమ్మకాల ఒప్పందాన్ని అమెరికా నిలిపివేస్తుందంటూ వార్తలువచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ఆమోదం లభించింది.

వీసా ఫీజులు భారీగా పెంచిన అమెరికా

వాషింగ్టన్, ఫిబ్రవరి1: అమెరికాకు వచ్చే విదేశీయుల నుంచి వసూలు చేసే నాన్-ఇమిగ్రెంట్ వీసా ఫీజులను బైడెన్ ప్రభుత్వం బుధవారం భారీగా పెంచింది. వీసా ఫీజులను పెంచడం 2016 తర్వాత ఇదే ప్రథమం. ఏప్రిల్1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. భారతీయులకు అత్యంత ఉపయోగకరంగాఉండే హెచ్-1బీ, ఎల్-1, ఈబీ-5 వీసాల రుసుములు గణనీయంగా పెరిగాయి. విదేశాల వృత్తి నిపుణులు అమెరికాలో ఉద్యోగాలు చేయడానికి హెచ్-1బీ వీసాలు ఇస్తారు. ఇందుకు ఉద్దేశించిన ఫారం 1-129 ఫీజు 460డాలర్ల (రూ.38,150)నుంచి 780డాలర్ల (రూ.64,690)కు పెరిగింది. హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్ రుసుము 10 డాలర్ల నుంచి 215 డాలర్ల (రూ.17,830)కు పెంచారు. ఈ నిర్ణయం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుంది. బహుళజాతి కంపెనీ ఉద్యోగుల బదిలీకి ఉద్దేశించిన ఎల్-1 వీసాల రుసుములు 460డాలర్ల నుంచి 1,385 డాలర్ల (రూ.1,14,860)కు పెరిగాయి. అమెరికా పౌరులకు ఉద్యోగాలిచ్చే వారికి ఈబీ-5 వీసాలు మంజూరు చేస్తారు. వీటి రుసుములు 3,675డాలర్ల నుంచి 11,160 డాలర్ల (రూ.9,25,510)కు పెరిగాయి. మరికొన్ని రకాల వీసాల ఫీజులు స్వల్పంగా తగ్గాయి.

కాంగ్రెస్ వలలో పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేయకండి. సీఎంను కలవాలనుకుంటే సమాచారం ఇచ్చి వెళ్లండి' అని సున్నితంగా హెచ్చరించినట్లు సమాచారం. "కాంగ్రెస్ ప్రభుత్వం చాలా సవాళ్లను ఎదుర్కోనాల్సి ఉంది. రాష్ట్ర ఆదాయం అంతంత మాత్రంగా ఉంది. కనీసం అంచనా వేయకుండానే ఇబ్బడిముబ్బడి హామీలిచ్చారు. అమలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఉంటుందా? ఉండదా? అనేది వారి చేతుల్లోనే ఉంది. ప్రతిపక్షంగా సమర్థంగా వ్యవహరిద్దాం. ఏడాది లోపే ప్రజలకు అసలు విషయం తెలుస్తుంది. మనం తొందరపడాల్సిన పనిలేదు. సంయమనం పాటిద్దాం. చక్కగా నిలబడితే చాలు.. వచ్చే ప్రభుత్వం మనదే"నని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలించామని.. ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహం, భయడాల్సిన అవసరం లేదన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే అంశంపై పార్లమెంటులో నిరసన తెలపాలని ఎంపీలకు సూచించారు. కేంద్ర జల శక్తి శాఖ మంత్రినీ కలవాలని నిర్దేశించారు. లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా పోరాడదామని.. అందరితో చర్చించి, మంచి అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు.

అసాధ్యమని ఆర్బీఐనే చెప్పింది

రూ.36 వేల కోట్ల రైతు రుణమాఫీ అసాధ్యమని, ఏక మొత్తంలో ఇన్ని కోట్లు మాఫీ వీలుకాదని ఆర్బీఐ తెలిపిందని పార్టీ నేతల వద్ద కేసీఆర్ వ్యాఖ్యానించారు. అయినా.. ఏపీలో చెల్లించారు. తెలంగాణలోనూ రుణమాఫీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి రైతాంగాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. "మనం అధికారంలో ఉన్నపుడే కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదు. కాంగ్రెస్ ఉంటే చేస్తుందా? వాళ్లకూ చేయదు. శుక్రవారం తెలంగాణ భవన్‌కు వస్తా. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటా" అని కేసీఆర్ తెలిపారు. కాగా, బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుసరించాల్సిన తీరుపై అంశాల వారీగా చర్చించారు. కేటీఆర్, పోచారం, హరీశ్‌రావు, తలసాని, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ప్రమాణం

గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డ ప్రసాద్ తన



చాంబర్‌లో మధ్యాహ్నం 12.45 గంటలకు ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పోచారం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలోని ప్రతిపక్ష నేత చాంబర్‌లో కేసీఆర్ ప్రత్యేక పూజలు చేసి బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా బాధ్యతలు చేపట్టారు. కాగా, ఈ కార్యక్రమాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కాలె యాదయ్య, పద్మారావుగౌడ్ హాజరు కాలేదని సమాచారం.

రేవంత్ నేను పాత మిత్రులం!

త్వరలోనే రేవంత్‌ను కలుస్తా: మల్లారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): "నేను రేవంత్‌రెడ్డి పాత మిత్రులం. టీడీపీలో కలిసి పనిచేశాం. ఇప్పుడు ఆయన రాష్ట్ర సీఎం. ఆయనను కలిస్తే తప్పేంటి" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రేవంత్‌ను త్వరలోనే కలుస్తానని చెప్పారు. కీసర ఆలయంలో నిర్వహించబోయే పూజా కార్యక్రమాలకు ఆహ్వానిస్తానని తెలిపారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. మల్కాజిగిరి ఎంపీ స్థానంలో పోటీ చేయాలని బీఆర్ఎస్ అధిష్ఠానం తనను కోరుతోందని చెప్పారు. అయితే, తన కుమారునికి అవకాశం కల్పించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశానన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని చెప్పారు. అయితే, "రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఆ పార్టీ వాళ్లకు షాక్.. అధికారం కోల్పోవడం మాకు షాక్" అని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. కాగా, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించిందన్న మల్లారెడ్డి.. త్వరలో గోవాలో రియల్ వ్యాపారం చేస్తానని చెప్పారు. ఇప్పటికే గోవాలో ఓ హోటల్ కొన్నట్లు తెలిపారు.

పాత.. కొత్త స్పీకర్ల కలయిక!



బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 1: ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్లుగా పనిచేసిన, చేస్తున్న ముగ్గురు ఒకచోట కలిశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరఫున అసెంబ్లీ స్పీకర్‌గా 2014-19 వరకు మధుసూదనా చారి, 2019-23 వరకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొనసాగారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున 2023 డిసెంబరు నుంచి గడ్డం ప్రసాద్.. స్పీకర్‌గా కొనసాగుతున్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం సందర్భంగా వారు ముగ్గురు కలిశారు. ఈ సందర్భంగా ముగ్గురూ కలిసి ఫొటో దిగారు.

టచ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. హైకమాండ్ వద్దనడంతో ఆగాం

» ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

కామారెడ్డి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలా మంది కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పలువురు ఎమ్మెల్యేలు కలవడమే ఇందుకు నిదర్శనం. వారంతా కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయి. అయితే.. హైకమాండ్ ఇప్పుడప్పుడే పార్టీ ఫిరాయింపులు వద్దని చెప్పింది. అందుకే.. ఫిరాయింపులను ప్రోత్సహించడంలేదు" అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వ్యాఖ్యానించారు. గురువారం ఆయన కామారెడ్డిలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. కేటీఆర్ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారంటూ షబ్బీర్ అలీ మండిపడ్డారు. "రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీ కొట్టినప్పటికీ కేటీఆర్ అహంకారం తగ్గడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకముందే సర్కారును కూల్చేస్తామని, త్వరలోనే ప్రభుత్వం పడిపోతుందంటూ కేటీఆర్ అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వాన్ని ఎలా కూలుస్తారో చూస్తాం" అని సవాల్ విసిరారు. పదేళ్లుగా రాష్ట్రాన్ని బీఆర్ఎస్ లూటీ చేసిందని ఆరోపించారు. ఓ అధికారి వద్దే రూ.100 కోట్ల అవినీతి సొమ్ము బయటపడడం బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు.

ఎంపీ టికెట్ ఆశావహులతో గాంధీభవన్‌లో సందడి

కాంగ్రెస్ టికెట్ కోసం 41 మంది దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు దరఖాస్తులు సమర్పించడానికి వచ్చిన ఆశావహులు, వారి అనుచరులతో గాంధీ భవన్‌లో గురువారం సందడి నెలకొంది. పార్టీ తరఫున తమకు టికెట్ కేటాయించాలని కోరుతూ 41 మంది అభ్యర్థులు దరఖాస్తులు ఇచ్చారు. బుధవారం ఏడుగురు దరఖాస్తు చేసుకోగా గురువారం 34 మంది పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ దరఖాస్తులను సమర్పించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి ఖమ్మం పార్లమెంట్ స్థానానికి దరఖాస్తు చేశారు. అదే నియోజకవర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు దరఖాస్తు సమర్పించారు. భువనగిరి నుంచి చామల కిరణ్ కుమార్ రెడ్డి, నిజామాబాద్ నుంచి ఆకుల లలిత తదితరులు లోక్‌సభ బరిలో నిలిచేందుకు తమకు అవకాశం కల్పించాలని దరఖాస్తులు అందజేశారు. నియోజకవర్గాల వారీగా.. మహబూబాబాద్ 9, నాగర్‌కర్నూల్ 8, వరంగల్ 6, భువనగిరి 6, ఖమ్మం 2, నిజామాబాద్ 3 చొప్పున దరఖాస్తులు అందినట్టు గాంధీభవన్ వర్గాలు పేర్కొన్నాయి.

బడ్జెట్‌లో అందమైన అబద్ధాలు చెప్పారు

» సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌లో అందమైన భాషతో అందమైన అబద్ధాలు చెప్పారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. బడ్జెట్‌లో ఉద్యోగాల ఊసే లేదని, కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేశారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు ప్రకటించలేదన్నారు. విద్యా రంగానికి 10శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా విస్మరించారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేలా బడ్జెట్ ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ విమర్శించారు.

ఇది భ్రమల బడ్జెట్: తమ్మినేని

కేంద్ర బడ్జెట్‌ను కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే, ప్రజలను భ్రమల్లో పెట్టే బడ్జెట్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రకటించిన బడ్జెట్ ఇది అని పేర్కొన్నారు.

జనాభా వృద్ధి రేటు సవాళ్లపై కమిటీ

» ఉన్నతాధికారులతో ఏర్పాటు చేయనున్న కేంద్రం
» సంతానోత్పత్తి రేటు తగ్గుతోందంటూ నివేదికలు
» తగినంతగా రీ ప్లేస్‌మెంట్ లేదనే ఆందోళనలు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో జనాభా వృద్ధి రేటులో ఎదురవుతున్న సవాళ్లపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మల తెలిపారు. సంతానోత్పత్తి రేటు భర్తీ స్థాయుల (రీప్లేస్‌మెంట్ రేట్) కంటే పడిపోయినట్లు గణాంకాలు సూచిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశంలో 2011లో చివరిసారిగా జనాభా లెక్కల సేకరణ చేపట్టారు. 2021లో మళ్లీ గణన నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ నేపథ్యంలో వాయిదా వేశారు. ఈ క్రమంలో జనాభాపై సాధికార లెక్కలు లేవు. వృద్ధి రేటు 2.1 నుంచి 2కి తగ్గిందంటూ 2020 నాటి శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్), 2.2 నుంచి 2కు పడిపోయిందంటూ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) పేర్కొన్నాయి. దీనికి పరిష్కార మార్గాలను కమిటీ సూచించనుంది. జనాభా వేగవంతమైన వృద్ధి, మార్పుల నుంచి ఉత్పన్నమయ్యే సవాళ్లను పరిశీలించనుంది.

గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు యాభై ఏళ్లు

» భాగ్యనగరం నుంచి వాల్తేరుకు మొదటి రైలు ఇదే
» 1974 ఫిబ్రవరి 1న ప్రారంభమైన ఎక్స్‌ప్రెస్



సికింద్రాబాద్/హైదరాబాద్ సిటీ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎక్స్‌ప్రెస్.. ఏపీలోని ఉభయ గోదావరి జిల్లాలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన రైలు ప్రయాణికులకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రైలు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో బెర్తు దొరికిందంటే.. బంగారం బిస్కెట్ దొరికినంతగా విశాఖ ప్రాంతవాసులు ఆనందపడతారంటే అతిశయోక్తికాదు. 1974 ఫిబ్రవరి 1న హైదరాబాద్-విశాఖపట్నం మధ్య ప్రారంభమైన మొట్టమొదటి రైలు ఇది. అంటే ఈ రైలు ప్రవేశపెట్టి గురువారానికి సరిగ్గా యాభై ఏళ్లు పూర్తయ్యాయి. గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రస్తుతం హైదరాబాద్(నాంపల్లి) స్టేషన్ నుంచి సాయంత్రం 5.05గంటలకు బయల్దేరి సికింద్రాబాద్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి మీదుగా.. విశాఖపట్నానికి చేరుకుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్దండులైన ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు ఇది ఎంతో ముఖ్యమైన రైలుగా ఉండేది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రావాలన్నా, ఇక్కడ్నుంచి స్వస్థలాలకు వెళ్లాలన్నా ఈ రైలులో వెళ్లడాన్ని సౌకర్యవంతంగా భావిస్తారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారుల తాకిడి కొంత తగ్గినా.. సాధారణ ప్రయాణికుల నుంచి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. దక్షిణ మధ్యరైల్వే ఆధ్వర్యంలో నడుస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు మొత్తం 18స్టేషన్లలో ఆగుతుంది. 24 బోగీలతో అతిపొడవైన రైలుగా పేరుగాంచిన ఈ ఎక్స్‌ప్రెస్ 710 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. గురువారం సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు రైల్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు నాంపల్లి స్టేషన్‌లో ఘనంగా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం విశేషం. దక్షిణ మధ్య రైల్వే కూడా ఈ ఎక్స్‌ప్రెస్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించింది. ఈ రైలు ఆగే అన్ని స్టేషన్లలో వేడుకలు జరిపారు. 1990లోనే 24 కోచ్‌లతో అతి పెద్ద రైలుగా పేరొందిన గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో 2000 సంవత్సరం నుంచి ఫస్ట్‌క్లాస్ ఏసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 1993 నుంచే థర్డ్ ఏసీ కోచ్‌లున్న ఈ రైలు.. దక్షిణ మధ్య రైల్వేలోనే మొదటి ఏసీ కోచ్ ఉన్న ఎక్స్‌ప్రెస్‌గా పేరుగాంచింది. ఈ ఎక్స్‌ప్రెస్‌ను నేరుగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ పర్యవేక్షిస్తారంటే దానికి ఉన్న ప్రాముఖ్యత చెప్పనక్కర్లేదు. రైలు నిర్వహణ నుంచి సమయపాలన, పరిశుభ్రత, ఆహార నాణ్యత, ఫిర్యాదులు, ఇతర ఆపరేషన్స్ అన్నీ ప్రతిరోజూ జీఎం టేబుల్ మీద ఉండాల్సిందేనని చెబుతుంటారు.

74 టీఎంసీలు కేటాయించాలి!

గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రాన్ని డిమాండ్ చేసిన తెలంగాణ

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానంలో తరలించే 148 టీఎంసీల జలాల్లో 74 టీఎంసీలను తమకు కేటాయించాలని తెలంగాణ కోరింది. నదుల అనుసంధానంలో తెలంగాణకు 45 టీఎంసీలు కేటాయించాలని ప్రతిపాదించారని, అవి సరిపోవని తెలిపింది. పూర్వ నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పలు ప్రాంతాలకు సాగునీటిని అందించాల్సి ఉన్నందున, 74 టీఎంసీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. గోదావరి-కావేరి అనుసంధానంపైతెలంగాణ లేవనెత్తిన అంశాలపై చర్చించడానికి వీలుగా గురువారం జలసౌధలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) హైదరాబాద్ విభాగం చీఫ్ ఇంజనీర్ దేవేందర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ నుంచి ఈఎన్‌సీ బి.నాగేంద్రరావు, అంతరాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. గోదావరి-కావేరి అనుసంధానంతో వివిధ అంశాలపై రాష్ట్ర అధికారులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కాగా తెలంగాణ అభ్యంతరాలపై మళ్లీ సమావేశం ఉంటుందని ఎన్‌డబ్ల్యూడీఏ స్పష్టం చేసింది. అనుమానాలన్నీ నివృత్తి చేశాకే నదుల అనుసంధానంలో ముందుకెళతామని తెలిపింది.

నేటి నుంచి పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి పంచాయతీలకు ప్రత్యేక అధికారులు బాధ్యత వహించనున్నారు. ఈ మేరకు గ్రామ ప్రత్యేకాధికారుల నియామకం, బాధ్యతల స్వీకరణ, విధి విధానాలను సూచిస్తూ.. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓ, తహశీల్దారు, ఎంపీఓ, డీటీ, ఆర్ఐ, ఇంజనీర్లు, ఎంఈవోలు, ఇతర గెజిటెడ్ స్థాయి అధికారులను గ్రామ ప్రత్యేక అధికారులుగా నియమించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడంతో పదేళ్ల తర్వాత మళ్లీ గ్రామాల్లో ప్రత్యేక పాలన ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించడంతో గురువారం సర్పంచుల వద్ద ఉన్న డిజిటల్ కీలు, చెక్కులు, ఇతర రికార్డులన్నీ సీజ్ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.

నేడు ఈజీఎస్ ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటన..?

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వం పే స్కేల్ ప్రకటిస్తామని హామీ ఇచ్చింది.. అది అమలుకు నోచుకోలేదు.. కొత్త ప్రభుత్వం మా ఆశలు నెరవేరుస్తుందని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నేడు(శుక్రవారం) ఇంద్రవెల్లి సభలో తమ పే స్కేల్ ప్రకటిస్తారని, సంబురాలు జరుపుకొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నామని ఈజీఎస్ ఉద్యోగులు ఒక ప్రకటనలో తెలిపారు.

కోర్టు ఆదేశాలిచ్చిన గంటల్లోనే జ్ఞానవాపీ సెల్లార్‌లో పూజలు

» హైకోర్టులో అప్పీలు చేసిన మసీదు కమిటీ

వారాణసి, ఫిబ్రవరి 1: జ్ఞాన్‌వాపీ మసీదు సెల్లార్‌లోని 'వ్యాస్ కీ టెఖానా'లో ఉన్న హిందూ దేవత విగ్రహాలకు పూజలు చేసుకోవచ్చంటూ జిల్లా కోర్టు ఆదేశాలు ఇచ్చిన కొద్ది గంటల్లోనే అక్కడ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో పూజలు చేసి లక్ష్మీదేవి, వినాయకులకు హారతి ఇచ్చారు. 31 సంవత్సరాల అనంతరం వ్యాస్‌జీ కా టెఖానాను పూజల కోసం తెరిచారని కాశీ విశ్వనాథ మందిర ట్రస్టు అధ్యక్షుడు నాగేంద్ర పాండే తెలిపారు. కాగా, తమకు అప్పీలు వంటి న్యాయ ప్రక్రియకు కూడా అవకాశం ఇవ్వకుండా హిందువులు పూజలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం తగదని పేర్కొంటూ మసీదు కమిటీ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే తొలుత హైకోర్టులో పిటిషన్ వేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పడంతో దాన్ని అమలు చేసింది. అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ సమర్పించి అత్యవసరంగా విచారణ జరపాలని కోరింది.

హేమంత్ సోరెన్‌కు ఒక రోజు కస్టడీ

» 10 రోజుల పాటు ఇవ్వాలన్న ఈడీ వినతిపై నేడు తీర్పు
» రాంచీలో 8.5 ఎకరాలు ఆక్రమించినట్టు కేసు నమోదు

రాంచీ, ఫిబ్రవరి 1: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను గురువారం ఇక్కడి పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టు ఒక రోజు జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది. పోలీసులు ఆయనను ఇక్కడి బిర్సా ముండా సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయనను పది రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలన్న వినతిపై కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. ఈడీ బుధవారం ఆయనను ఏడు గంటల పాటు విచారించింది. అనంతరం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా రాత్రి పది గంటల సమయంలో గవర్నర్ హౌస్ వద్ద అరెస్టు చేసింది. కాగా, రాత్రి సమయంలో గవర్నర్ హౌస్ ఆవరణలోనే అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ గురువారం సోరెన్ లాయర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సమయంలో ఆయన ధరించిన మతపరమైన లాకెట్, రింగ్‌లను తీసివేయాలని ఈడీ అధికారులు కోరగా అందుకు ఆయన నిరాకరించారు. రాంచీలో సోరేన్ 12 చోట్ల 8.5 ఎకరాల విస్తీర్ణంగల స్థలాలను అక్రమంగా కలిగి ఉన్నారంటూ ఈడీ కేసుపెట్టింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ నగదు చలామణి జరిగినట్టు ఆరోపించింది. తొలుత భూమి రికార్డుల నకిలీ పత్రాలను తయారు చేస్తున్నారంటూ రెవెన్యూ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్‌పై కేసు నమోదయింది. ఆయన వద్ద 11 ట్రంకు పెట్టెల్లో ఒరిజినల్, నకిలీ దస్తావేజులు, 17 ఒరిజినల్ రిజిస్టర్లు లభించాయి. దీనిపై జరిగిన విచారణలో ఇందులో సోరేన్‌కు సంబంధం ఉందంటూ ప్రసాద్ ఫోన్‌లో లభించిన సమాచారం ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. వాంగ్మూలం నమోదు చేయడానికని పిలిచి ఎలా అరెస్టు చేస్తారని సోరెన్ తరఫున హాజరైన అడ్వకేట్ జనరల్ రాజీవ్ రంజన్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి జరిగిన కుట్ర అని ఆరోపించారు.



జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలను తరలించడానికి బేగంపేట విమానాశ్రయం వద్ద సిద్ధంగా ఉన్న బస్సులు

ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

చంపయి సోరెన్ గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిశారు. హేమంత్ సోరెన్ రాజీనామా చేసిన అనంతరం రాష్ట్రానికి కొత్త సీఎం లేకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొని ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి లేకపోవడంతో రాజకీయ సంక్షోభం ముదిరిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న తమ విజ్ఞప్తిని అంగీకరించాలని కోరారు. కాగా, చంపయి సోరెన్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేయడంతో.. జేఎంఎం-కాంగ్రెస్ కూటమి ఎమ్మెల్యేలను హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం రెండు చార్టర్డ్ విమానాలను సిద్ధం చేయగా.. సాయంత్రం 6.30 గంటల సమయంలో పొగమంచు ఎక్కువగా ఉండడంతో వాటిని రద్దు చేశారు. 81 మంది సభ్యులున్న ఝార్ఖండ్ అసెంబ్లీలో జేఎంఎం కూటమికి 43 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక మనీలాండరింగ్ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ మాజీ సీఎం హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను విచారించేందుకు సీజేఐ ముగ్గురు న్యాయమూర్తులతో ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. సోరెన్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరపనున్నారు.

'దివీస్ సేవలు అభినందనీయం'

చౌటుప్పల్ టౌన్, చౌటుప్పల్ మునిసిపాలిటీ, ఫిబ్రవరి 1: దివీస్ సేవలు అభినందనీయమని చౌటుప్పల్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శివకుమార్ అన్నారు. జడ్పీహెచ్ఎస్‌లో గురువారం దివీస్‌సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మందులను ఉచితంగా అందజేశారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పాదరక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి జయంత్‌కుమార్, స్కూల్ డిప్యూటీ హెచ్ఎం ప్రసాదరావు, దివీస్ సంస్థ ప్రతినిధులు వి. వెంకటరాజు, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుంతలో పడిన వాటర్ ట్యాంకర్

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 1: పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ ఎదుట ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణకు తీసిన గుంతలో గురువారం వాటర్ ట్యాంకర్ పడిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకొని ప్రాణాలు కాపాడుకున్నాడు. ఆ సమయంలో విద్యార్థులు ఆ ప్రాంతంలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ట్యాంకర్‌లోని నీటిని పూర్తిగా తీయించి ప్రొక్లైనర్ సాయంతో ట్రాక్టర్‌ను గుంత నుంచి బయటికి తీశారు. గుంతలో పడిపోయిన వాటర్ ట్రాక్టర్ కొద్దిగా దెబ్బతిన్నది. అసెంబ్లీ ఎన్నికల ముందు హడావిడిగా రోడ్డు విస్తరణ కోసం తీసిన గుంత ప్రమాదకరంగా మారిందని, ఈ గుంతను తక్షణమే పూడ్చి వేయించాలని స్థానిక కౌన్సిలర్ దండ హిమబిందు అరుణ్‌కుమార్ కోరారు.

వర్గీకరణ ఉద్యమాన్ని బలోపేతం చేయాలి

వలిగొండ, ఫిబ్రవరి 1: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ పిలుపు నిచ్చారు. మండలకేంద్రంలో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమం తుది దశకు చేరిందన్నారు. మంద కృష్ణ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసి వర్గీకరణ సాధించి మాదిగ, ఉప కులాల ప్రజలకు న్యాయం జరిగేలా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచందర్, దానయ్య, అంజయ్య, భిక్షపతి, శివకుమార్, మహేష్, కృష్ణ, చింటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మునిసిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్ మునిసిపాలిటీ, ఫిబ్రవరి 1: విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. మునిసిపల్ కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను గురువారం సందర్శించారు. వసతి కేంద్రాల్లో చదువుకున్న అనేకమంది ఉన్నత స్థానంలో ఉన్నారన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి కృషిచేస్తుందన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ తాడూరి పరమేష్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు పాండు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనను నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను అన్ని రంగాల కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు. భువనగిరిలో గురువారం జరిగిన వేర్వేరు సమావేశాల్లో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ సామాన్య ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి సంక్షేమశాఖ పీడీకి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమాల్లో సీఐటీయూ నాయకులు మాయ కృష్ణ, కొండయ్య, అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రమాకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

వలిగొండ, ఫిబ్రవరి 1: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యా శాఖ అధికారి కె. నారాయణరెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో శ్రీ వేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రేటర్ నల్లగొండ ఆర్గనైజేషన్ సహకారంతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు స్నాక్స్ కోసం గురువారం నగదును ఆ సంస్థ ప్రతినిధి సుధీర్‌రాజు ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రేటర్ నల్లగొండ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధి సుధీర్‌బాబు, బుస్స రమేష్, ఎంఈవో శ్రీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకోజు భాస్కర్, పాల్గొన్నారు.

దుకాణదారులపై కేసులు ఎత్తివేయాలి

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 1: భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని చేనేత టైఅండ్‌డై పట్టు చీరల ఉత్పత్తిదారుల దుకాణాలపై ఇటీవల చేనేత జౌళిశాఖ ఆర్‌డీడీ వెంకటేశం ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన విషయం విదితమే. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తూ నోటీసులు జారీ చేశారని, ఆ కేసులను ఎత్తివేయాలని కోరుతూ పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు తడక రమేష్ ఆధ్వర్యంలో చేనేత ప్రతినిధులు చేనేత, జౌళిశాఖ కమిషనర్ అలుగు వర్షిణికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత టైఅండ్‌డై పట్టుచీరల ఉత్పత్తి దారుల సంఘం ప్రధాన కార్యదర్శి భారత లవకుమార్, ప్రతినిధులు కర్నాటి బాలరాజు, సూరపల్లి శ్రీనివాస్, సీత లక్ష్మణ్, గుండు ఉప్పలయ్య, మంగళపల్లి రమేష్ పాల్గొన్నారు.

నడవలేకపోతున్నా.. జనగామ తీసుకెళ్లండి

● మద్యం మత్తులో 108 సిబ్బందితో ఓ వ్యక్తి వాగ్వాదం



రమేష్

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 1: ఆపదలో ఉన్నాను.. ఆదుకోండి అంటూ ఫోన్ కాల్ రాగా అర్ధరాత్రి సమయంలో అక్కడికి వెళ్లిన అత్యవసర సేవల సర్వీస్(108) సిబ్బంది అసహనానికి గురయ్యారు. యాదగిరిగుట్టలో బుధవారం అర్ధరాత్రి దాటాక ఈ సంఘటన జరిగింది. 108 సిబ్బంది తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. జనగామకు చెందిన రమేష్ బుధవారం అర్ధరాత్రి 12గంటల సమయంలో 108నెంబరుకు ఫోన్ చేసి తాను వంగపల్లి-జమ్మాపురం గ్రామాల మధ్య జాతీయ రోడ్డుపైన ఉన్నానని, ఆరోగ్యం బాగా లేక నడవలేని స్థితిలో ఉండి అవస్థలు పడు తున్నానని ఆవేదన వ్యక్తంచేశారు. కొద్ది సేపటికి అనంతరం ఆ ప్రాంతానికి వెళ్లిన 108 సిబ్బంది రమేష్‌ను ప్రశ్నించగా తాను హైదరాబాద్ నుంచి నడుచుకుంటూ వస్తున్నానని చెప్పాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రమేష్ తనకు ఏమీకాలేదని, జనగాం వరకు నడువలేని స్థితిలో ఉన్నానని 108లో జనగాంకు తీసుకెళ్లాలని వాదించాడు. తాము ప్రమాదానికి గురైన వారిని, ఆరోగ్యంతో బాధపడుతున్న వారిని మాత్రమే 108కు తీసుకెళ్తామని, అవసరమైన భువనగిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళతామని చెప్పినా కొద్దిసేపు వాదించాడు. చేసేదేమీలేక 108 సిబ్బంది అక్కడినుంచి వెనుతిరిగారు.

వివాహిత అదృశ్యంపై కేసు



లావణ్య(ఫైల్)

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 1: భువనగిరి మండలంలో వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. భువనగిరి మండలంలోని మాసుకుంటకు చెందిన పోతరాజు లావణ్య తన భర్త స్వామి మద్యానికి బానిసై తనను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని గత నెల 31న ఇంటి నుంచి వెళ్లిపోయింది. రెండు రోజులుగా బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లావణ్య సోదరుడు రత్నపురం సుమన్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. తప్పిపోయిన మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు నలుపు, ఆకుపచ్చ రంగు చీర ధరించారని, వివరాలు తెలిసిన వారు సెల్:8712662472కు తెలియజేయాలని పేర్కొన్నారు.

ఆలేరును మోడల్ సిటీగా తీర్చిదిద్దుతాం



శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 1: ఆలేరును మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్ట మునిసిపాలిటీ పరిధిలోని కొత్తగుండ్లపల్లి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణం పనులకు గురువారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి రూ.10కోట్లు కేటాయించారని వాటిలో ప్రధానంగా తాగునీటి సమస్య, పాఠశాలలను అభివృద్ధి చేయడానికి రూ.3కోట్లుఖర్చు చేయనున్నట్లు తెలిపారు. మిగితా నిధులతో గ్రామాల్లో మౌలిక సమస్యలు, అండర్ డ్రైనేజీ కాల్వలు, సీసీరోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మాణానికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునే భక్తులు తగిన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి సదుపాయాలు కల్పిస్తామన్నారు. త్వరలో యాదగిరిగుట్టకు సీఎం రేవంత్‌రెడ్డిని తీసుకొచ్చి గతంలో నిర్మాణంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు సీఎం దృష్టికి తీసుకొచ్చి గత ప్రభుత్వం కంటే అతి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం స్థానిక సాయిబాబ ఆలయంలో పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేశ్, కో ఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, గుట్ట పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాటబత్తిని ఆంజనేయులు, మాజీ ఉపసర్పంచ్ గుండ్లపల్లి భరత్‌గౌడ్, బందారపు భిక్షపతిగౌడ్, ముక్కెర్ల వెంకటేష్, గుండ్లపల్లి నర్సింహ్మాగౌడ్, ముక్కెర్ల రాజు, కంబాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు సన్మానం



కూరెళ్ల విఠలాచార్యను సన్మానిస్తున్న నాయకులు

రామన్నపేట, ఫిబ్రవరి 1: ప్రముఖ కవి డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించిన సందర్భంగా మండలంలోని వెల్లంకిలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడం మండలానికి, జాతికే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మారోజు అనంతాచారి, ఆకవరం మధుబాబు, కన్నెకంటి వెంకటేశ్వరాచారి, చొల్లేటి పాండురంగాచారి, ఆకవరం శ్రీనివాస్, కాంజోజు శ్రీనివాసచారి, దశరథచారి, నరసింహాచారి, రాఘవాచారి, పాండురంగాచారి, శశి కృష్ణాచారి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ అభివృద్ధిని ప్రజలకు వివరించాలి



భువనగిరిలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని గావ్‌చలో అభియాన్ నల్లగొండ జిల్లా కన్వీనర్ పల్నాటి వెంకటరెడ్డి కోరారు. పట్టణంలో గురువారం నిర్వహించిన మునిసిపాలిటీ స్థాయి సమావేశంలో మాట్లాడారు. పది సంవత్సరాల్లో ప్రధాని మోదీ అనేక సంస్కరణలు అమలు చేశారన్నారు. పేదరిక నిర్మూళనకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. అన్ని వర్గాలకు పేదలకు ప్రవేశపెట్టిన పథకాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను బూత్ స్థాయిలకు తీసుకువెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ మోదీ పాలనను ప్రజలు కోరుకుంటున్నారని, మూడో సారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, దూడల బిక్షం, జి. సురేందర్‌రెడ్డి, ఊడుగు వెంకటేశ్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ పి. శ్రీధర్‌బాబు, నాయకులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, పీఎల్ఎన్‌రావు, బిక్షమాచారి, ఎండీ. మోహినొద్దీన్, బడుగు కృష్ణ, వెంకటేష్ ఉన్నారు.

భువనగిరి టౌన్: ప్రధాని మోదీ బీసీల పక్షపాతిఅని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డి. లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. బీహార్‌కు చెందిన జననాయకుడు కర్పూరి ఠాగూర్‌కు కేంద్రప్రభుత్వం భారతరత్న అవార్డు పకటించడాన్ని హర్షిస్తూ ఓబీసీ మోర్చా, నాయిబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో గురువారం భువనగిరిలో ప్రధాని ఫ్లెక్సీకి పాలాభిశేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, బీజేపీ, ఓబిసి మోర్చా పట్టణ అధ్యక్షుడు పి ఉమాశంకర్‌రావు, తుమ్మల నగేశ్, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాయ దశరథ, పట్నం శ్రీనివాస్, ఉడుత భాస్కర్, మేడి కోటేశ్, పట్నం కపిల్, ఉషాకిరణ్, రత్నపురం శ్రీశైలం, ఆర్ కృష్ణాచారి, పల్లెపాటి వేణు, మణీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సర్పంచుల కృషి అభినందనీయం



చౌటుప్పల్‌లో సన్మానం పొందిన సర్పంచులు

అడ్డగూడూరు, చౌటుప్పల్ రూరల్, ఆత్మకూరు(ఎం), బీబీనగర్, ఫిబ్రవరి 1: గ్రామాల అభివృద్ధికి సర్పంచుల కృషి అభినందనీయమని పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడారు. పదవీ విరమణ పొందిన సర్పంచులను గురువారం సన్మానించారు. అడ్డగూడూరు మండలంలోని కోటమర్తి చిప్పలపల్లి బాలును ఎంపీటీసీ పాశం యాదమ్మ సత్యనారాయణ సన్మానించారు. పంతంగి, పెద్ద కొండూరు సర్పంచులు గాయత్రి రమేష్‌గౌడ్, బాతరాజు సత్యం, పాలకవర్గ సభ్యులను గ్రామస్థులు సన్మానించారు. ఆత్మకూరు(ఎం) సర్పంచ్ జెన్నాయికోడె నగేష్, ఉప సర్పంచ్ డి. నవ్య, వార్డుసభ్యులు, పోతిరెడ్డిపల్లి సర్పంచ్ గనగాని మాధవి మల్లేశం, ఉప సర్పంచ్ ఎర్ర శోభ, వార్డు సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మ, ఎంపీడీవో నిరంజన్, సింగిల్ విండో చైర్మన్ జె. శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. పదవీ విరమణ పొందిన సర్పంచులను బీబీనగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుధాకర్‌గౌడ్, జడ్పీటీసీ గోళి ప్రణీతపింగల్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గణేశ్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో స్వాతి పాల్గొన్నారు.





గజ్వేల్ శాసనసభ్యుడిగా హైదరాబాద్‌లో ప్రమాణ స్వీకారం చేసిన బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత, బీఆర్ఎస్ నాయకుడు జిట్టా బలకృష్ణారెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా రవాణాధికారి రవీందర్

చౌటుప్పల్ టౌన్, చౌటుప్పల్ మునిసిపాలిటీ, ఫిబ్రవరి 1: రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా రవాణాధికారి గంట రవీందర్ కోరారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా పట్టణంలోని ట్రినిటీ స్కూల్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలను నడపడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, దీంతో అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. వాహనాలు నడిపే వారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అతి వేగం, ఓవర్ లోడ్, అజాగ్రతతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వ్యక్తులు సీటు బెల్టు విధిగా ధరించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్ ప్రమాదాలు జరగడంతో పాటు చట్ట ప్రకారం నేరమని, అదే మైనర్‌లు వాహ నాలను నడపకూడదని తెలిపారు. ప్రమాదాల నివారణకు తీసుకో వాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులకు వివరించాలని విద్యార్థులకు సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్స వాలపై క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రినిటీ స్కూల్ చైర్మన్ కృష్ణా రావు, ప్రిన్సిపాల్ మంజుల, డ్రిల్ మాస్టర్స్ మహేష్, సందీప్, కరుణాకర్, అనూష, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలి



ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌ఆర్‌ఆర్ బాధితులు

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 1: రీజనల్ రింగు రోడ్డు అలైన్మెంట్ మార్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్‌ఆర్‌ఆర్ బాధితులు కోరారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే తాను బునాదిగాని, కాళేశ్వరం కాల్వల్లో, రిలియన్స్ పైపులైన్, హైటెన్షన్ విద్యుత్ స్తంభాల ఏర్పాటు, రహదారి విస్తరణకు భూములు కోల్పోయామని ఆర్‌ఆర్‌ఆర్‌తో పూర్తిగా తాము భూములు కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి నెలకొందని వెంటనే అలైన్మెంట్ మార్పించే విధంగా చూడాలని కోరారు. ఎమ్మెల్యే కుంభం స్పందించి తమ సమస్యను సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయిగిరి, ఎర్రంబెల్లి, వర్కట్‌పల్లి, గోకారం నిర్వాసితులు యాదగిరి, గొర్ల వెంకటేశం, మహేందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు ఉన్నారు.

నిధులు కేటాయించాలని సీఎంకు వినతి

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 1: భువనగిరి నియోజకవర్గంలో బునాది గాని కాల్వ మరమ్మతుల కోసం రూ.159.03కోట్లు, ధర్మారెడ్డిపల్లి కాల్వకు రూ. 129.80 కోట్లు, పిల్లాయిపల్లి కాల్వకు రూ.95.60కోట్ల నిధులు కేటాయించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లో బుధవారం సీఎం కలిసి ఎమ్మెల్యే భూదాన్ పోచంపల్లి మండలం జలాల్పూర్‌లోని స్వామిరామానంద తీర్థ గ్రామీణాభివృద్ధి సంస్థను వృత్తి విశ్వ విద్యాలయంగా మార్చాలని, ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరారు.

ఇన్‌చార్జి డీపీవోగా నాగిరెడ్డి: జిల్లా పంచాయతీ ఇన్‌చార్జి టి. నాగిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. డీపీవో సునంద భర్త మృతితో సెలవులపై వెళ్లగా, ఆమె స్థానంలో డీఆర్డీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న నాగిరెడ్డికి కలెక్టర్ హనుమంతు కే. జెండగే బుధవారం ఇన్‌చార్జి డీపీవోగా బాధ్యతలు అప్పగించారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

మోత్కూరు, ఫిబ్రవరి 1: వరి చేలను కాండం తొలుచు పురుగు ఆశించి పంట దెబ్బతింటున్నదని, వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధి కారి(డీఏవో) అనురాధ అన్నారు. గురువారం మండలంలోని పాటిమట్ల గ్రామంలో క్షేత్రస్థాయిలో వరి చేలను ఆమె పరిశీలించి మాట్లాడారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.3 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కె.స్వప్న, ఎఈవో ఎం.అశోక్‌కుమార్, రైతులు బండ సంజీవరెడ్డి, సంకరి భూపాల్, మోతె సంజీవరెడ్డి బండి రాజు ఉన్నారు.

ఉన్నతాధికారులకు నివేదికలు అందించాలి

గుండాల, ఫిబ్రవరి1: ప్రతి పాఠశాలలో అడ్మిషన్లను యూ డైస్ ప్లస్‌లో పకడ్బందీగా నమోదు చేసి అన్ని రికార్డులను సక్రమంగా ఉన్నతాధికారులకు నివేదికలు అందించాలని జిల్లా డీఈవో ఆఫీస్ ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీహరి అయ్యంగార్ అన్నారు. రికార్డుల పరిశీలనలో భాగంగా మండలంలోని ఎంఆర్‌సీని సందర్శించి డ్రా బాక్సులోని విద్యార్థులను చైల్డ్‌ట్రాక్ చేసి సరిచేయాలని సూచించారు. కొత్తగా వచ్చిన ఆరు కంప్యూటర్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో అధికారులు పి లింగయ్య, ఎంఆర్‌సీ సిబ్బంది నరేశ్, లింగయ్య, సీతాపురం హెచ్ఎం లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 1: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని ఏఐటీయూసీ ఆటో, ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందారపు వెంకటేశ్వర్లు అన్నారు. భువనగిరిలో గురువారం జరిగిన ఆటో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యామ్నాయ ఉపాధి చూపలేని పక్షంలో నెలకు రూ.10 వేలు జీవన భృతి ఇవ్వాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, బి తిరుమలేశ్, చెక్క వెంకటేశ్, గోరేటి రాములు, ఎండీ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ధృఢత్వాన్ని పెంపొందిస్తాయి

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 1: క్రీడలు మానసిక ధృఢత్వాన్ని పెంపొందిస్తాయని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత చల్లా తేజ అన్నారు. మండలంలోని రామచంద్రాపురంలో యువకులకు క్రికెట్ కిట్లు, పదో తరగతి విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎడమ పెంటయ్య, బి. ఉపేందర్, కె. సాయి, దుర్గాప్రసాద్, ఎస్. దినేష్, నవీన్, ఉదయ్, కిరణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



బేటి బచావో-బేటి పడావో కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 1: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ శారద అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బేటి బచావో-బేటి పడావో కార్యక్రమంపై పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు గురువారం అవగాహన కల్పించారు. కిశోర బాలికల వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గౌనకాలజిస్టు డాక్టర్ ప్రశాంతి, డీపీఎంవో మధుసూదన్‌రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణి, పీడీకే డాక్టర్ రంజిత్ కుమార్, డీపీహెచ్ఎన్‌వో ఈశ్వరురాణి, హెచ్ఈవో వసంత, ప్రిన్సిపాల్ ఇందిర, ఆరోగ్య సిబ్బంది ఎ. సుమతి, ఎస్. అనూరాధ, భార్గవి, మనీష పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ యువకుడు మృతి

వలిగొండ, ఫిబ్రవరి 1: చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం... మండలంలోని పొద్దటూరు గ్రామానికి చెందిన కె భాను ప్రసాద్(22) బుధవారం రాత్రి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా వలిగొండ పట్టణ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా 108 సిబ్బంది చికిత్స నిమ్మితం భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

బాధితుడికి ఎల్‌వోసీ చెక్కు అందజేత

మోత్కూరు, ఫిబ్రవరి 1: మోత్కూరు మునిసిపాలిటీ సాయినగర్ కాల నీకి చెందిన కార్పెంటర్ మల్యాల వీరాచారి అనారోగ్యంతో బాధపడుతూ డయాలసిస్ కోసం నిమ్స్‌లో చేరి చికిత్స పొందుతున్నాడు. అతనిది నిరుపేద కుటుంబం కావడంతో చికిత్స చేయించుకోవడానికి అయ్యే ఖర్చుల కోసం రూ.1.50 లక్షల ఎల్‌వోసీ చెక్కును తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ గురువారం బాధితుడు వీరాచారికి అందజేశారు. ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు.

కిసాన్ సెల్ మండల అధ్యక్షుడిగా నరేందర్

వలిగొండ, ఫిబ్రవరి 1: మండలంలోని జాలుకాలువ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మామిడి నరేందర్‌రెడ్డి కిసాన్ సెల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, సుమన్‌రెడ్డి, రాజ్‌కుమార్ ఉన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ఆత్మకూరు(ఎం) ఫిబ్రవరి 1: మండలకేంద్రంలో ప్రతికంఠం వేంకటరామనర్సరాజు-మాణిక్యమ్మ జ్ఞాపకార్థం నేతాజీ యువజన మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను సర్పంచ్ జె.నగేష్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పి.పూర్ణచందర్‌రాజు, మాజీ సర్పంచ్ యాస లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు యాస ఇంద్రారెడ్డి, నేతాజీ యువజన మండలి అధ్యక్ష, కార్యదర్శులు పి.శంతన్‌రాజు, ఎల్మినేటి మురళీ కృష్ణ, చెరుకు శ్రీను, పోతగాని మల్లేశం, డి.భాస్కర్, లతోపాటు సభ్యులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మోత్కూరు, ఫిబ్రవరి 1: దాతలు అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని దాచారం గ్రామానికి చెందిన అండెం రాంరెడ్డి-సత్తమ్మల జ్ఞాపకార్థం ఆయన కుమారుడు దయాకర్‌రెడ్డి అం దించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మండల కార్యదర్శి మెట్టు మంగేష్, చేతరాశి అంజయ్య, ఎస్.భాస్కరాచారి ఉన్నారు.

జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి రక్తదానం

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 1: కుమారుడు ఎలిమినేటి మాదవరెడ్డి 6వ జన్మదినం సందర్భంగా తండ్రి జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి వినూత్నంగా రక్తదానం చేశారు. గురువారం జిల్లాకేంద్ర ఆసుపత్రిలో తన అనుచరులతో కలిసి కుమారుడి జన్మదినం పురస్కరించుకొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో డీసీహెచ్‌వో చిన్నా నాయక్, జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, నాయకులు పగిడిమర్రి వీరేశం, ఎండి అయూబ్, యాట కుమార్, ఎండి సాజిద్, ఉస్మాన్ చౌదరి, డొప్ప వెంకటేష్ ఉన్నారు.

దాతల సహకారం అభినందనీయం

తుర్కపల్లి, ఫిబ్రవరి 1: గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలకు దాతలు ముందుకొచ్చి సహకారం అందించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయురాలు వి. శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని గందమల్ల ఉన్నత పాఠశాలకు దాత తోట శార్వాణీ సహకారంతో పీపుల్స్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో బల్లలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పబ్బ సూరజ్, ఉపాధ్యక్షుడు గారెపల్లి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సర్నేని గూడెంలో పశువైద్య శిబిరం

రామన్నపేట, ఫిబ్రవరి 1: మండలంలోని సర్నేనిగూడెం గ్రామంలో గురువారం జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పశు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 50 పశువులను పరీక్షించి ఉచితంగా మందులను అందించారు. 22 ఏళ్లకు నట్టల నివారణ మందులను తాగించారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట ఏడీఏ సంజీవరావు, మండల పశువైద్యాధికారి శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, యాదయ్య, భాను ప్రసాద్, గోపాలమిత్ర సూపర్‌వైజర్, గోపాల మిత్రలు మల్లేష్, ఇటుకల మల్లారెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా పద్మ

భువనగిరి టౌన్, ఫిబ్రవరి1: రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా భువనగిరికి చెందిన రత్నపురం పద్మ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం నియామక పత్రం అందజేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తామని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా నియమితులైన పద్మను పలువురు అభినందించారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 1: బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్ సేవలకు గుర్తింపుగా భారతరత్న అవార్డు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భూదాన్‌పోచంపల్లిలో భారత ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గంగపురం శ్రవణ్‌కుమార్, బీజేపీ భువనగిరి అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, రాష్ట్ర చేనేతసెల్ కన్వీనర్ ఎన్నం శివకుమార్, నోముల గణేష్, నాయకులు చౌదరిమెట్టు భిక్షపతిచారి, అంజయ్యచారి, భారత బాలరాజు, రచ్చ శేఖర్, గొలనుకొండ ప్రభాకర్, కొండ నరేందర్ ఉన్నారు.